క్లుప్తంగా

నేడు గుడ్‌మార్నింగ్ నరసరావుపేట

నరసరావుపేట: పట్టణంలో ఆదివారం ఉదయం 7 గంటలకు గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఉదయం ఏడుగంటలకల్లా గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్దకు హాజరు కావాలని కోరారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట రూరల్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో 8వ ఉచిత యోగ శిక్షణా శిబిరం ఈనెల 15వ తేదీ నుంచి రావిపాడు రోడ్డు ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్టు నందనయోగి జల్లి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26 రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయని, 8 సంవత్సరాల నుంచి 80 సంవత్సరాల వయస్సు గల వారు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు జరిగే యోగ శిక్షణలో 42 రకాల ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానముద్రలు, ఆరోగ్యసూత్రాలు, అధ్యాత్మిక ఉపదేశం అంశాలు ఉంటాయని వివరించారు.

దోమల నివారణకు చర్యలు



రొంపిచర్ల: దోమల నిర్మూలనకు పరసరాల పరిశుభ్రతతో పాటు మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవడమే మార్గమని మండల వైద్యాధికారి డాక్టర్ పి. జగన్ నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని మునుమాక గ్రామంలో దోమల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం రొంపిచర్ల ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దోమలు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో లార్విక్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. గ్రామస్తులకు దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. నీటి నిల్వలే దోమల పెరుగుదలకు దోహదపడతాయన్నారు. గృహాల్లో, వీధుల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం. రామయ్య, ఏఎన్ఎం డి.నక్షత్రం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల ర్యాక్ పాయింట్ పరిశీలన



నాదెండ్ల: మండలంలోని సాతులూరు రైల్వే ఎరువుల ర్యాక్ పాయింట్‌ను శనివారం జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు, ఏడీఈ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. జిల్లాకు కేటాయించిన ఎరువుల నిల్వలను పరిశీలించారు. సీఐఎల్ యూరియా 1500 మెట్రిక్ టన్నులు పల్నాడు జిల్లాకు కేటాయించారని తెలిపారు. అవేజ్ గోడౌన్‌లను తనిఖీ చేశారు. కేటాయించిన ఎరువులను డీలర్లు, సొసైటీలకు పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏవో శ్రీలత, సిబ్బంది జీపీ శ్రీనివాసరావు, రమేష్ ఉన్నారు.

రొంపిచర్లలో భారీ వర్షం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం భారీ వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమైన వర్షాలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. అయితే ప్రస్తుత వాతావరణం రాత్రికి కూడా వర్షాలు కురిసేటట్లు ఉందని రైతులు అంటున్నారు. భారీగా వర్షం కురియటంతో మాగాణి పొలంలో నాట్లు వేస్తున్న కూలీలకు, పొలం పనులు నిర్వహిస్తున్న వారికి వర్షంతో అంతరాయం ఏర్పడింది. చేసేది లేక రైతులు, కూలీలు పనులను నిలిపి మధ్యాహ్నానికే ఇంటి బాట పట్టారు.

రేపు ఆధార్ శిబిరం

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు ఉన్న శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్ పాఠశాలలో ఈ నెల 15న ఆధార్ మార్పులు, చేర్పులకు శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గీతాంజలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల ఆధార్ మార్పు నుంచి పేర్లలో తప్పులు, అడ్రస్ తదితర వాటిని మార్పులు, చేర్పులకు సరైన పత్రాలతో వస్తే ఈ శిబిరంలో చేస్తారని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో ఒక్క రోజు ఏర్పాటు చేస్తున్న అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 98661 65117, 08641-234234 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

హసనాబాద్(క్రోసూరు): మండలంలోని హసనాబాద్ గ్రామ రైతు షేక్ కందిపాటి నాగులుకు చెందిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. పొలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో ఎద్దు రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో మృతి చెందిందని బాధిత రైతు తెలిపాడు.

భయపెడుతున్న గ్రామసింహాలు

- నాదెండ్ల వాసులకు దడపుట్టిస్తున్నాయి
- గుంపులుగా సంచారం



గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

నాదెండ్ల: మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద రోజు రోజుకూ ఎక్కువ అవుతోంది. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేస్తున్నాయి. వేకువజామున, రాత్రిళ్లు పనుల నిమిత్తం రోడ్ల మీదకు రావాలంటే ఏ వైపు నుంచి కుక్కలు దాడి చేస్తాయోనని రైతులు, మహిళలు భయపడుతున్నారు. రాత్రిళ్లు ట్యూషన్‌కు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. గొర్రెల మందలు, గేదెలపై దాడి చేసి గాయపరుస్తుండటంతో రైతులు విలువైన జీవాలను కోల్పోతున్నారు. ద్విచక్ర వాహనదారులను వెంబడించి గాయపరుస్తుండటంతో ప్రయాణించాలంటేనే భయమేస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన యంత్రాంగం మిన్నకుండటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

పట్టించినా ఫలితం లేదు

ఇటీవల పంచాయతీ అధికారుల సహకారంతో గ్రామంలో కుక్కలు పట్టించి దూరంగా అడవిలో వదిలి పెట్టారు. దాదాపుగా 250 శునకాలను ఈ విధంగా పట్టుకొని తరలించినట్లు సర్పంచ్ వీర్ల వెంకటస్వామి వెల్లడించారు. అయితే బెడద తీరిందనుకొని సంతోషించే లోపు రెండో రోజు నుండి అంత కన్నా రెట్టింపు సంఖ్యలో కుక్కలు గ్రామంలో ప్రత్యక్షమయ్యాయన్నారు.కుక్కలు పట్టుకోవటానికి లక్షల రూపాయల పంచాయతీ నిధులు కేటాయించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వివరించారు. చుట్టు ప్రక్కల ఊర్లల్లో కుక్కలు పట్టుకుని ఇక్కడ వదిలేసి ఉంటారని గ్రామస్తులు భావిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ వీధి కుక్కల (గ్రామ సింహాలు) సమస్యను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు.



కుక్కలను బంధిస్తున్న సిబ్బంది (ఫైల్)

చక్కని చేతిరాత.. ఒక కళ



విద్యార్థులకు క్యాలీగ్రఫీలో శిక్షణ

- విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది
- చేతిరాత శిక్షకులు షేక్ ఝున్నుసాహెబ్
- లింగారావుపాలెం జెడ్పీహైస్కూల్లో ఒక్కరోజు క్యాలీగ్రఫీలో శిక్షణ

యడ్లపాడు: చక్కని చేతిరాత ఒక కళ అని..ఆ అద్భుత కళ విద్యార్థి జీవితాన్ని అందంగా మార్చేందుకు దోహదపడే కీలక శక్తి అని చేతివ్రాత నిపుణులు షేక్ ఝున్నుసాహెబ్ చెప్పారు. మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం చేతివ్రాత శిక్షణ శిబిరం నిర్వహించారు. హైస్కూల్ హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 330 మంది విద్యార్థులకు క్యాలీగ్రఫీ, లుసిడా హ్యాండ్ రైటింగ్‌పై కీలక సూచనలకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా కొనసాగిన ఈ శిక్షణ ముగింపు సందర్భంగా హెచ్‌ఎం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్య ఒక్కటే వారి చేతిరాత బాగుంటే పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించే వీలుంటుందన్నారు. శిక్షణ నేర్చుకున్న అంశాలను నిత్యం సాధన చేయాలని సూచించారు. అన్నింటికీ మించి మంచి చేతిరాత విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. శిక్షణ అనంతరం ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు షేక్ ఝున్నుసాహెబ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ షేక్ జాన్‌సైదులు, గ్రామపెద్దలు నంబూరు శివరామకృష్ణ, తోకల సత్యనారాయణ, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, డి.సుధాకరరావు, టి.విజయశామ్యూల్, యు మల్లేశ్వరి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను కూటమి విస్మరించింది



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

- సంక్షేమ పథకాలు అమలు చేయాలంటూ డిమాండ్
- 15న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి సంఘం పిలుపు

నరసరావుపేట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సంఘ జిల్లా కార్యాలయంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. సిలార్ మసూద్ మాట్లాడుతూ సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హక్కులు సాధనకు ఈనెల 15న విజయవాడ సీతారాంనగర్‌లోని రాష్ట్ర లేబర్ కమీషనర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో భవన-ఇతర నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి కార్మికుల ఓట్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం 15 నెలలు గడుస్తున్నా నేటికీ అమలు చేయలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అన్ని రాష్ట్రాలలో వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, మన రాష్ట్రంలో అందుకు భిన్నంగా పరిస్థితి ఉందన్నారు. కార్మికులకు ప్రమాదాలు జరిగినా ఆదుకునే పరిస్థితి లేదన్నారు. పిల్లల స్కాలర్‌షిప్, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, ఇన్సూరెన్స్ చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక, హర్యానా రాష్ట్రాలలో వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, తమిళనాడులో మూడు నెలల నుంచి ప్రమాదవశాత్తు చనిపోయిన భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇస్తున్నారన్నారు. సంక్షేమ బోర్డు నుంచి తప్ప ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఆర్థిక భారం లేని సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ.ప్రసాదరావు, అధ్యక్షులు కె.ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కె.సురేష్, ఆంజనేయులు, కొండలరావు, కోశాధికారి ఏ.ఆంజనేయులు, సహాయ కార్యదర్శి చిన్నఏసు పాల్గొన్నారు.

నాదెండ్ల తహసీల్దార్ బదిలీ



నాదెండ్ల: మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.చంద్రశేఖర్ అచ్చంపేటకు బదిలీ అయ్యారు. ఆయన ఈ ఏడాది జూలై 15న నాదెండ్ల తహసీల్దార్‌గా విధుల్లో చేరారు. మూడు నెలలు గడవక ముందే బదిలీ అవడంతో రెవెన్యూ అధికారుల్లో చర్చ జరుగుతోంది. డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న షేక్ సల్మాన్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

22 నుంచి శరన్నవరాత్రులు

మాచర్ల రూరల్: దసర శరన్నవరాత్రుల మహోత్సవాలను ఈ నెల 22 నుంచి వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రారంభించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు భవనాశి వెంకటేశ్వర్లు, సన్నిధి హనుమంతరావు, జక్కా హరికృష్ణ తెలిపారు. శనివారం ఈ మేరకు అమ్మవారి దేవాలయంలో ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. పాత మాచర్లలోని వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 22న బాల త్రిపుర సుందరీ దేవి, 23న గాయత్రీదేవి, 24న కాళరాత్రిదేవి, 25న వన దుర్గాదేవి, 26న సంతానలక్ష్మీదేవి, 27న ధనలక్ష్మీ దేవి, 28న శైల పుత్రి దేవి, 29న సరస్వతి దేవి, 30న మహాకాళిదేవి, అక్టోబర్ 1 మహిషాసురమర్దిని దేవి, 2న పుష్పయ్య అలంకరణలతో అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు అర్చకులు శ్రీనివాస శర్మ, దత్తు, రాఘవశర్మలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గోళ్ళ బాల జనార్ధనరావు, మారం సత్యనారాయణ, పి.సత్యనారాయణ, చిన్ని చంద్రం, తుమ్మేపల్లి అంకారావు, జాయింట్ సెక్రెటరీ తిరివీధి వెంకట నాగేశ్వరరావు, భవనాశి రవితేజ, కొత్తమాసు చెన్నకేశవరావు, విజయలక్ష్మి, పరిటాల ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో భారీ వర్షం



పిడుగురాళ్ల: పట్టణంలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం వరకు వర్షం పడింది. ఉదయం సమయంలో ఎండ తీవ్రంగా ఉండగా, మధ్యాహ్న సమయంలో ఉక్కపోత ఉండి మధ్యాహ్న 1.30 గంట నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. దీంతో కట్టెల అడితీల సెంటర్, అన్నా క్యాంటీన్, అదే విధంగా లోతట్టు ప్రాంతాలన్నీ నీటిలో నిండిపోయాయి. రైతులు ఈ వర్షం నష్ట కలిగిస్తుందని తెలుపుతున్నారు. ప్రత్తి పంట తీసే దశలో ఉందని, పూత రాలిపోవచ్చునని, పత్తి తీయటానికి ఇబ్బందిగా మారే అవకాశం ఉందని పత్తి రైతులు చెబుతున్నారు. అదే విధంగా మిరప రైతులు ఈ పంట వలన నీరు నిలబడిపోయి తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉందని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

గురజాలలో..

గురజాల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శనివారం మధ్యాహ్నం గురజాలలో వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది. ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది.

ఆకలితో ఉండకూడదనే ఆహార సేకరణ



అభాగ్యులకు ఆహారాన్ని అందిస్తున్న జనచైతన్య సమితి సభ్యులు

పెదకూరపాడు: ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో మిగిలిన ఆహారాన్ని సేకరిస్తున్నామని అన్నదానం మహా పుణ్యకార్యమని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. పెదకూరపాడులోని పట్టాభి రామచంద్రస్వామి (బొమ్మల గుడి రామాలయం) దేవాలయం నిర్మాణం జరిగి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం రాత్రి జరిగిన అన్నదాన కార్యక్రమంలో 300 మందికిపైగా భోజనాలు మిగిలి పోయాయని ఆలయ కమిటీ ప్రతినిధి కొర్లకుంట శ్రీనివాసరావు జన చైతన్య సమితి ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. జన చైతన్య సమితి ప్రతినిధులు దాసరి విజయ్ బెన్నిబాబు, తుళ్లూరి సాంబశివరావు, బెజ్జం నాగేశ్వరరావు, కమ్మంపాటి కోటేశ్వరరావు మిగిలిన ఆహారాన్ని సేకరించారు. గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాల వద్ద, మార్కెట్ సెంటర్లతో పాటు పెదకాకాని సమీపంలోని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల వరకు మిగిలిన భోజన పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మిగిలిన ఆహారాన్ని వృథా చేయకూడదనే లక్ష్యంతో నిద్రాహారాలు లేకపోయినా ఆకలితో ఉన్నవారికి భోజనం పెట్టడంలో ఎంతో తృప్తి ఉంటుందన్నారు. జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడుదాసరి విజయ్ బెన్నిబాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కొర్లకుంట బ్రహ్మం (సింహం), కాకర్ల పరమేశ్వరరావు తదితరులు ఉన్నారు. ఫంక్షన్లలో భోజనాలు మిగిలితే 88867 77767, 98855 57987, 98489 77677 నంబర్లలో సంప్రదించాలని జనచైతన్య సమితి ప్రతినిధులు కోరారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు



ఎమ్మెల్యే లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ బాధ్యులు

సత్తెనపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ సాచివేత ధోరణిని నిరసిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిరసన వారం ఉద్యమ కార్యాచరణలో భాగంగా 3వరోజు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు శనివారం గుంటూరులోని క్యాంప్ ఆఫీస్‌లో ఏపీటీఎఫ్ నాయకులు మెమొరాండం అందించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఒక్క పెండింగ్ బకాయి కూడా విడుదల చేయలేదన్నారు. ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ విద్యారంగ సమస్యల పరిష్కారానికి మంత్రి లోకేష్, సీఎం చంద్రబాబు శ్రద్ధ చూపాలన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా పాత తాలూకా కేంద్రాల్లో, 16న జిల్లా కేంద్రాల్లో ఉపాధ్యాయులతో నిరసన, ప్రదర్శనలు నిర్వహిస్తామని సంఘ నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, గుంటూరు జిల్లా కార్యదర్శి గడిపాటి దాస్, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు బాళ్ల శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ మొహమ్మద్ ఇబ్రాహీం తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించండి

రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు

మాచర్ల రూరల్: రాష్ట్రంలో మూడున్నర లక్షల పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించాల్సిన పీఆర్‌సీ కమిషన్, ఐఆర్, కరువుభత్యం వెంటనే విడుదల చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నా ఇంత వరకు పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్ వేసి పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను చెల్లించే విధంగా చర్యలు తీసుకొని కేవలం పెన్షన్ పైనే ఆధారపడే ఉద్యోగులను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సంఘగౌరవ సలహాదారు చంద్రమౌళి రామనాథశర్మ 80వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు అందించారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

దాచేపల్లి: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నగర పంచాయతీలోని మనుషర్షా పేటకు చెందిన వంగర సుకుమార్(20) కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. పనులు చేసుకుని ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో సుకుమార్ తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందాడు.

రోడ్డుపై ఇసుక లారీ బోల్తా



చాగంటివారిపాలెం సమీపంలో రోడ్డు మార్జిన్‌లో తిరగబడిన లారీ

ముప్పాళ్ళ: సత్తెనపల్లి వైపు నుంచి నరసరావుపేట వైపు ఇసుక లోడుతో వెళుతున్న లారీ చాగంటివారి పాలెం సమీపంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అదుపు తప్పి మార్జిన్‌లోకి బోల్తాపడిన ఘటన శనివారం జరిగింది. ఘటనలో లారీడ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ముప్పాళ్ళ పోలీసులు సంఘటనా స్థలానికి చేరి లారీ డ్రైవర్‌ను నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. లారీలోని ఇసుకంతా మార్జిన్‌లో పడటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

నర్సింగ్ విద్యార్థులు అంకితభావంతో పనిచేయాలి

ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ జయకరుణ



నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అతిథులు

నరసరావుపేట రూరల్: నర్సింగ్ వృత్తిలోకి ప్రవేశించే విద్యార్థులు శ్రద్ధ, అంకితభావం, సేవాభావం కలిగి ఉండాలని నరసరావుపేట ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ మేరుగ జయకరుణ తెలిపారు. కృష్ణవేణి నర్సింగ్ కళాశాలలో శనివారం లాంప్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఏరియా హాస్పిటల సూపరింటెండెంట్ జయకరుణ, ఏరియా హాస్పిటల్ హెడ్‌నర్స్ విజయకుమారిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని తెలిపారు. వైద్యులు తరువాత ఈ వృత్తిలో నర్సులకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ధనిక, పేద సంబంధం లేకుండా అందరికీ సమానమైన సేవలు అందించాలని తెలిపారు. రోగులకు మనోధైర్యాన్ని నింపడంతో పాటు జబ్బులను నయం చేసే కీలకపాత్ర నర్సులందని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ మేదరమెట్ల శేష గిరిరావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నూతలపాటి జోష్న, కందుల ఉదయలక్ష్మి, మౌనిక, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాదినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

'తిప్ప'లు తీర్చారు!





సాక్షి ఎఫెక్ట్..

రొంపిచర్ల: నిర్లక్ష్యం ఎగబాకింది! అనే శీర్షికతో సాక్షి జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో చేజర్ల, నరసరావుపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలను దుస్సార, తిప్ప తీగలు అల్లుకు పోయాయి. శనివారం వార్త ప్రచురితమవ్వటంతో స్పందించిన ఆ శాఖ అధికారులు తీగలను తొలగించి ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ స్తంభం వైర్లు పై ఉన్న చెట్లను తొలగించి శుభ్రపరిచారు. ఐదారు నెలలుగా దుస్సార, తిప్ప తీగలతో విద్యుత్ వల్ల ఏమన్నా ఇబ్బందులు ఏర్పడతాయోమోనని ఆందోళన చెందుతున్న అక్కడి వారు తీగలు తొలగింపుతో సాక్షిని అభినందించారు.

వైద్యుల సేవలు ఆదర్శనీయం



వైద్యులను సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

పెదకూరపాడు: పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్యం అందించి కరోనా విపత్తు సమయంలో త్యాగపూరిత సేవలు అందించిన వైద్యులు కేతావత్ రమేష్ నాయక్, జొన్నలగడ్డ చైతన్య సేవలు ఆదర్శనీయమని విశ్రాంత సివిల్ సర్జన్, పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం మాజీ వైద్యాధికారి రవివర్మ అన్నారు. డెప్యూటీ సివిల్ సర్జన్లుగా పదోన్నతిపై బదిలీ అయిన వైద్యులు రమేష్, చైతన్యలకు శనివారం పెద్దకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో అభినందన సభ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతంలో ఓపీ పెరగడానికి వైద్యులు రమేష్, చైతన్య కృషి చేశారన్నారు. చిన్న వయసులో డెప్యూటీ సివిల్ సర్జన్లుగా పదోన్నతి పొందడం అభినందనీయమని వైద్యాధికారి మండ విద్య అన్నారు. పదోన్నతిపై సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి బదిలీ అయిన డాక్టర్ రమేష్, తణుకు వైద్యశాలకు బదిలీ అయిన డాక్టర్ చైతన్యతో తమకు ఉన్న అనుబంధాన్ని వైద్యులు, సహచర సిబ్బంది గుర్తు చేసుకున్నారు. వారికి అధికారులు రవి వర్మ, విద్య, సహచర వైద్యులు ఆశీర్వాదం, సుజాత, విశ్రాంత హెడ్ నర్స్ లక్ష్మీరాజ్యం ఇతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.

వివాహిత అదృశ్యం

పెదకూరపాడు: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పెదకూరపాడు ఎస్సై గిరిబాబు శనివారం తెలిపారు. మండలంలోని బలుసుపాడు గ్రామానికి చెందిన వివాహిత ఈనెల 7వ తేదీ రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రపోతానని చెప్పింది. తర్వాత నుంచి కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.